క్లుప్తంగా

రామభక్తుల దీక్ష విరమణ


ములగపూడి రామగిరికొండపైకి ఇరుముడితో వెళుతున్న భక్తులు

రౌతులపూడి: మండలంలోని ములగపూడి రామగిరి కొండపై వెలసిన పురాతన సీతాకోదండరామస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మాలధారణ చేసిన భక్తులు బుధవారంతో దీక్ష విరమించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారణ చేసిన భక్తులు స్వామివారికి ఇరుముడిని సమర్పించారు. కార్యక్రమంలో రామభక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: శ్రీరామనవమి ముగింపు వేడుకలను పురస్కరించుకుని జగపతినగరం పంచాయతీ కొత్తపేట రామాలయం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

పండితుడు వెంకటేశ్వరరావుకు సత్కారం


పండితుడు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ట్రస్టీ రవి ప్రసాద్ తదితరులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావును బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డు వద్ద వేంచేసిన రామాలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్ల కల్యాణం, ప్రత్యేక పూజలు, పవళింపు వేడుకలను మూడు రోజుల పాటు కన్నులపండువగా నిర్వహించారు. కాగా వేడుకలు విజయవంతం కావడానికి కృషి చేసిన పండితుడు వెంకటేశ్వరరావును ఆలయ ట్రస్టీ చింతాకుల రవిప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. పెద్దిపాలెం, పరిసర గ్రామాల్లో సనాతన ధర్మ పరిరక్షణకు వెంకటేశ్వరరావు చేస్తున్న సేవలు అభినందనీయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సమావేశం

జగ్గంపేట: స్థానిక క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నియోజకవర్గస్థాయి క్రియాశీలక సభ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభం


సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: మండలంలోని గోవిందపురం, వెంగయమ్మపురం, మల్లిశాల గ్రామాల్లో రూ.90 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కానికి పెద్దపీట


కోటనందూరులో డ్వాక్రా మహిళలకు రుణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

కోటనందూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. స్థానిక మండల పరిష్కృత్ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బారు కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 82 వినతులు వచ్చాయి. వీటిలో అధికంగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయి. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ద్వారా యాంత్రిక ఉపకరణాలు, డ్వాక్రా మహిళలకు రూ.48 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్, ఎంపీడీఓ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతోంది..!

- గజ్జనపూడిలో మూడు రోజులుగా నిలిచిపోయిన తాగునీటి సరఫరా
- తరచూ మరమ్మతులకు గురవుతున్న పైప్‌లైన్లు
- తాగునీటికి అల్లాడిపోతున్న ప్రజలు


గజ్జనపూడిలో రక్షిత మంచినీటి పథకం

ప్రత్తిపాడు రూరల్: వేసవి కాలం ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని ఏదో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తుతుంది. తాజా మండలంలోని గజ్జనపూడిలో మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గుక్కెడు నీటి కోసం స్థానిక ప్రజలు పడరానిపాట్లు పడ్డారు. గ్రామంలో తరచూ సమస్య తలెత్తడంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు.

రెండు కిలో మీటర్ల దూరం నుంచి..

పైప్‌లైన్ దెబ్బతినడంతో మూడు రోజుల పాటు తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్రామంలో మంచినీటి జలాలు లేకపోవడంతో గ్రామ శివారు వైఆర్సీ కాలవ నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని గ్రామంలోని రక్షత మంచినీటి పథకానికి తరలిస్తున్నారు. రెండు కిలో మీటర్ల దూరం నుంచి గ్రామానికి తరలించడంతో వాటర్ ట్యాంకులకు నీరు ఎక్కని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా పైప్‌లైన్ పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో ఎక్కడికక్కడ తాగునీరు వృథాగా పోతోంది. దీనికి తోడు చిన్నపాటి గాలివేస్తే చాలు గ్రామంలో తరచూ విద్యుత్ సమస్య తలెత్తుతోంది. దీంతో నిత్యం రక్షిత మంచినీటి పథకం నిర్వహణ నిలిచిపోతుంది. కాగా అధికారులు పైప్‌లైన్లకు మరమ్మతులు చేసి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించారు.


నిత్యం మరమ్మతులకు గురవుతున్న పైప్‌లైన్

నిత్యం తాగునీటి సమస్య



గ్రామంలో నిత్యం తాగునీటి తలెత్తడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వేసవి కాలం కావడంతో పరిస్థితి దారుణంగా ఉంటోంది. నీటి సరఫరా నిలిచిపోవడంతో మూడు రోజుల పాటు అష్ట కష్టాలు పడ్డాం. ప్రసుత్తం తాత్కాలికంగా సమస్య పరిష్కారమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– సింగిడి లక్ష్మి, గజ్జనపూడి

కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తాం



గ్రామంలో పైప్‌లైన్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో తరచూ తాగునీటి సమస్య తలెత్తుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ. 85 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఈ నిధులు మంజూరైతే నూతనంగా పైప్‌లైన్, పంపు షెడ్డు, మోటారు, వాటర్ ట్యాంకులను నిర్మిస్తాం. ఈ పనులు పూర్తయితే శరభవరం, గజ్జనపూడి గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– ఎంవీఆర్ కుమార్ బాబు, ఎంపీడీఓ, ప్రత్తిపాడు

దాడిశెట్టి రాజాను కలసిన వైఎస్సార్ సీపీ నేతలు


దాడిశెట్టి రాజాను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను మండల వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన గొర్లి రామచంద్రరావు, ఉద్యోగ, పెన్షనర్ల సంఘ తుని నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన లెక్కల స్వామినాయుడు ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో దాడిశెట్టి రాజాను కలిశారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో దాడిశెట్టి రాజాను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దాడిశెట్టి రాజా సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, సుర్ల రాజు, రుత్తల జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ నాతి బుజ్జి ఉపాధి హామీ పనులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువుల షెడ్లు, నీటి తొట్టెలు, పంట కాలువలు, అమృత సరోవర్ చెరువుల పనులు ప్రారంభించాలని సూచించారు. ఉపాధి కూలీలకు సరాసరి వేతనం రోజుకు రూ.307 వచ్చే విధంగా పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి బి.శ్వేత, ఏపీఓ కృష్ణంరాజు, ఈసీ రమేష్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై వర్క్‌షాప్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంసీఏ విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై మూడు రోజుల పాటు వర్క్‌షాప్‌ను నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఎ.రమేష్ తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ప్రాధాన్యం, భవిష్యత్తులో వాటి ఉపయోగాలు, ప్రాజెక్ట్స్ అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డీన్స్ రవి కుమార్, సీహెచ్‌వి రాఘవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ కోసం తీర్మానం చేయాలి

- పోలవరం నిర్వాసితులకు కలెక్టర్ ప్రశాంతి సూచన
- కృష్ణునిపాలెంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటన


ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ పి.ప్రశాంతి

గోకవరం: పోలవరం నిర్వాసితులు ప్రత్యేక గ్రామ పంచాయతీ కోసం తీర్మానం చేసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. దేవీపట్నం మండలం పరిధిలో 18 గ్రామాలకు చెందిన కుటుంబాలకు కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో సుమారు 100 ఎకరాలు సేకరించారు. ప్రస్తుతం ఈ కాలనీలో సుమారు ఐదు వేల జనాభాతో సుమారు 1160 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీలో సమస్యలు పరిష్కరించడంతో పాటు తమకు ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వారు వినతి పత్రం అందజేశారు. దీనిలో భాగంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో స్థానిక అధికారులతో కలిసి కలెక్టర్ బుధవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలు దేవీపట్నం మండలం పరిధికి చెందిన దృష్ట్యా వారికి రేషన్ పంపిణీ, ఉపాధి హామీ పథకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డులు గోకవరం మండలంకు మార్పు చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సుమారు ఐదు వేల మంది జనాభా ఉన్న దృష్ట్యా దేవీపట్నం, గోకవరం మండల అధికారుల సమక్షంలో మీరంతా గ్రామ సభ నిర్వహించుకుని, ఒక ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు కోసం పేరును ప్రతిపాదిస్తూ తీర్మానం చేసుకోవాల్సి ఉందన్నారు. ఆ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడం ద్వారా ఇక్కడ ఒక సచివాలయం, రేషన్ షాప్, ఇతర పరిపాలన పరమైన వ్యవస్థల ఏర్పాటు సాధ్యమవుతుందన్నారు. కృష్ణునిపాలెం పంచాయతీ ఆధ్వర్యంలో శానిటేషన్ నిర్వహణలో తలెత్తుతున్న ఇబ్బందులను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి.శాంతామణి, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, గోకవరం తహసీల్దార్ ఎంవీ సాయిప్రసాద్, ఎంపీడీఓ ఎం.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరండి

కిర్లంపూడి: పదో తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరి పలు రాయితీలు పొందాలని తామరాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.కృష్ణ సూచించారు. మండలంలోని గోనేడ తదితర గ్రామాల్లో బుధవారం అధ్యాపకులు కాంపెయినింగ్ నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు రాసిన బాలికల ఇళ్లకు తామరాడలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో చేరాలని, ఉన్నత విద్య అందిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనంతో పాటు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగ్ ఉచితంగా అందిస్తామన్నారు. పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని వారంతపు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అనుభజ్ఞులైన అధ్యాపకులతో విద్యను అందిస్తున్నట్టు తెలిపారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి


పదోన్నతి పొందిన కార్యదర్శులను సత్కరిస్తున్న ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తదితరులు

ప్రత్తిపాడు: ప్రతి ఉద్యోగి తమ విధులను బాధ్యతగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు సూచించారు. మండలంలోని ప్రత్తిపాడు -3, పోతులూరు సచివాలయ కార్యదర్శులు ఫక్కుర్తి శ్రీనివాసరావు, గంగాధర్ గ్రేడ్ 5 నుంచి గ్రేడ్ 4 కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. వీరు పదోన్నతులపై మారేడుమిల్లి, రాజఒమ్మంగి మండలం మారేడుబాక పంచాయతీలకు బదిలీ అయ్యారు. బదిలీలను పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుమార్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఎంపీడీఓ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు, గంగాధర్‌లను పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది మూర్తి, సురేష్, రత్నం, గొల్లబ్బాయి, పంచాయతీ కార్యదర్శులు జ్యోతుల పద్మరాజు, బి.కామరాజు, బి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు


ఏలేశ్వరంలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్షలు బుధవారం 38వ రోజు కొనసాగాయి. జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకూ ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన


చేపూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలమణి

తుని రూరల్: ఘన వ్యర్థాల నుంచి సంపద సృష్టించే కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పెద్దాపురం డీఎల్‌పీఓ బాలమణి సూచించారు. మండలంలోని తేటగుంట, చేపూరు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో 21 కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు)లో వానపాముల సేంద్రియ ఎరువుల తయారీకి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మండలంలోని 71 మంది క్లాప్‌మిత్రలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గత నెలలో 27న రాగంపేట సందర్శనకు గ్రామానికి ఒకరు చొప్పున వెళ్లారని, ఈ నెల 23న క్లాప్‌మిత్రలందరికీ శిక్షణ ఇస్తామన్నారు. సంపద కేంద్రాలు వినియోగంలోకి వస్తే పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూరుతాయన్నారు. ఈఓపీఆర్‌డీ జి.మరిడియ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

మందుల విక్రయంలో జాగ్రత్తలు పాటించాలి

గోకవరం: మందుల విక్రయంలో జాగ్రత్తలు పాటించాలని రాజమహేంద్రవరం రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.కల్యాణి సూచించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆదిత్య ఆస్పత్రి ప్రాంగణంలో బుధవారం గోకవరం ఏరియా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎన్ఆర్ఎక్స్ మందులు విక్రయంలో జాగ్రత్తలు, వాటిని భద్రపరిచే విషయం, నిర్వహించాల్సిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస కళ్యాణచక్రవర్తి, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి జగదీష్, మండలంలోని కెమిస్టులు, డ్రగ్గిస్టులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం


గోకవరంలో కళ్లాల్లో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

గోకవరం: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం వేడిగా ఉన్నప్పటికీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. కళ్లాల్లో ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు కళ్లాల్లో ధాన్యాన్ని బరకాలతో కప్పి ఉంచుకోవాలని ఏఓ రాజేశ్వరి సూచించారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

తొండంగి: పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ అన్నారు. మండలంలోని ఒంటిమామిడి దివీస్ ల్యాబోరేటరీస్‌లో బుధవారం జాతీయ భద్రతావారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో యంత్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు, కార్మికులకు అవగాహన కల్పించారు. పారిశ్రామిక అభివృద్ధిలో భారతదేశం అమెరికా, జపాన్, చైనా వంటి దేశాలతో పోటీ పడుతోందన్నారు. వనరులను సద్వినియోగం చేసుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని ఉద్యోగులు, కార్మికులకు సూచించారు. పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దివీస్ సంస్థ జనరల్ మేనేజర్ వి.నాగేశ్వర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఏవీ మురళీ కృష్ణ, దివీస్ భద్రతా సీనియర్ మేనేజర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో చోరీ

ప్రత్తిపాడు: తుని – రాజమహేంద్రవరం పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలి సొమ్ము మాయమైంది. కొడుకు పెళ్లికి దుస్తులు కొనుగోలు చేసేందుకు రాజమహేంద్రవరం వెళ్తుండగా ప్రత్తిపాడు వచ్చేసరికి బ్యాగ్‌లో ఉన్న రూ.1.50 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన కొమ్మూరి లక్ష్మి తన కుమారుడు శివగంగ వరప్రసాద్ వివాహం ఈనెల 23న జరుగనుంది. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు బుధవారం రాజమహేంద్రవరానికి బంధువులైన నేమాల బాబూరావు, కృష్ణవేణి, నాగదుర్గ, నాగ సత్యవతి, కొమ్మూరి రాజేశ్వరి, తోటలక్ష్మి, కె. వరలక్ష్మి, బద్ది రమణలతో కలిసి బయలుదేరారు. తొమ్మిది మంది బంధువులు దుర్గాడ నుంచి ఆటోలో కత్తిపూడి వరకు వచ్చి, తుని-రాజమహేంద్రవరం పల్లె వెలుగు బస్సు ఎక్కారు. బస్సులో గుర్తు తెలియని వ్యక్తులు నగదును కాజేశారు. వారు ప్రయాణిస్తున్న బస్సు స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపానికి వచ్చే సరికి బ్యాగులో సొమ్ము మాయమైంది. ఈ మేరకు కొమ్మూరి లక్ష్మి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం చెప్పారు.

రేషన్ బియ్యం స్వాధీనం

రౌతులపూడి: మండలంలోని శృంగవరంలో అక్రమంగా ఒక షెడ్డులో నిల్వ ఉంచిన మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి దాడి జరిపినట్టు మండల సివిల్ సప్లయి అధికారి జీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. ఆ బియ్యం కాశ్ల సత్తిబాబుకు చెందినది గుర్తించి, అతడిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. దాడిలో నాగు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి తీరని లోటు


పెరుమాళ్లపురంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

తుని: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవులకు తీరని లోటు అని తుని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు వి.ప్రసాదబాబు అన్నారు. కొట్టాం సెంటర్‌లో బుధవారం దైవజనులు రెవరెండ్ చార్లెస్ పిన్ని చర్చిలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘ గౌరవ అధ్యక్షుడు డి.నరేంద్ర, రాజ్ భూపతి, ఉపాధ్యక్షుడు థామస్, పాస్టర్ చార్లెస్ పిన్ని, జోషి పాల్గొన్నారు.

తీరంలో శాంతి ర్యాలీ

తొండంగి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు సంతాపం తెలిపారు. ఈ మేరకు పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం తీరప్రాంతంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పెరుమళ్లపురం నుంచి ఒంటిమామిడి మీదుగా తొండంగి వరకూ పాస్టర్లు, క్రైస్తవులు శాంతి ర్యాలీ చేశారు. ప్రభుత్వం పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి నిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మురార్జీ అందజేశారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండలంలోని వెంకటనగరం పంచాయతీ తోటపల్లి గిరిజన తండాలో సారా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. కాగా శంఖవరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎనిమిది మంది పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. వీరిని బుధవారం శంఖవరం తహసీల్దార్ వద్ద హాజరుపరచినట్టు సీఐ వివరించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

శంఖవరం: స్థానిక పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా వైద్యులు ఆర్‌వీవీ సత్యనారాయణ, ఎస్.రాజీవ్ 100 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. జనసేన పార్టీ నాయకులు గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ, నాయకుడు తలపండి బుజ్జి, కర్ణ సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, తలపంటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం


బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు కట్టోజు ప్రసాద్ కుమార్తె హైమాకు విశ్వబ్రాహ్మణ సంఘం రూ.16,200 ఆర్థిక సాయం అందజేసింది. ఈ సందర్భంగా ప్రత్తిపాడు విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గానాల గంగాధర్, జిల్లా క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో సంఘ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న హైమను ఆదుకునేందుకు తమ వంతు సహకారం అందించామని, రానున్న రోజుల్లో ఆమెకు ఏ అవసరం వచ్చినా తాము ముందుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ధరణాలకోట వీరబాబు, ఎ.రమణ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తుని: గుల్లిపాడు – నర్సీపట్నం మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 45 ఏళ్లు) మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. అతడి ఒంటిపై బాట్ మ్యాన్ ప్రింట్ కలిగిన నెక్ టీషర్ట్, లేత నీలం రంగు జీన్ ఫ్యాంట్, ఎడమ చేయి మణికట్టుపై జ్యోతి అనే పచ్చబొట్టు ఉన్నాయన్నారు. రెండు రోజుల క్రితం ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నామన్నారు.